

# పసిడిమనసులు - షర్మిల



# అగ్రహారం పెళ్ళిభోజనం

ఉమారాణి పెళ్లంట. ఉమారాణీ నేనూ స్నేహితులం. ఇద్దరం ఏడోక్లాస్ చదువుతున్నాం. ఉమారాణి పెద్ద కళ్లు, తెల్లగా వుంటుంది. నన్ను తన ఇంటికి తీసుకెళ్లింది ఓరోజు.

ఉమారాణీ వాళ్ల తాత హాల్లో బల్లమీద కూర్చుని భాగవతం చదువుకుంటున్నాడు. నన్ను చూసి “ఎవరీ పిల్ల?” అని అడిగాడు.

“ మన పక్క ఊరే బార్లపూడి” అంది .

"ఏమిట్లు?" అన్నాడాయన కనుబొమలు ముడేసి నా వంక చూస్తూ ...

ఏమిట్లు అంటే అర్థం ఏ కులం అని. "వాళ్లు కమ్మ వాళ్లు" అని ఉమ చెప్తుండగానే నేను మా తాత పేరు చెప్పాను. " ఓసినీ ! అంకయ్య తమ్ముడి మనవరాలివా ! మీ పెద్ద తాత నేనూ స్నేహితులంలే " అని ఫెళ్లున నవ్వాడు.

అప్పటివరకు బిగుసుకపోయి నించున్న నేనూ ఉమారాణీ "హమ్మయ్య" అనుకున్నాం.

ఇదంతా ఇంటికొచ్చి చిట్టెమ్మకి చెప్పా . "బ్రాహ్మలు కదూ ! అంతేలే పట్టింపులుంటాయి" అంది . అసలే మా నాయనమ్మకి వాళ్లంటే మహా భక్తి .

ఒక రోజు స్కూల్ కి వచ్చిన ఉమారాణి తన పెళ్లి అని చెప్పింది .

"పెళ్లంటే పెద్దాళ్లకి కదా నీకి పదకొండేళ్లే కదా!" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును కానీ మా తాత, అమ్మమ్మ ముసలివాళ్లయి పోతున్నారుకదా!"

" మా నాన్న లేరు అమ్మ ఒక్కత్తే చేయలేదుగా అందుకే " అంది ఆరిందాలాగా.

మమ్మల్ని అందరినీ పెళ్లికి రమ్మని కార్డులు పంచింది. మా వూరి పిల్లలు సుబ్బారాయుడు గారి అమ్మాయి ఝాన్సీ, మా వూర్లో అందరికీ గడ్డాలు, జుట్టు కత్తిరించే నారాయణ కూతురు లక్ష్మీ రంగమ్మకి కూడా  కార్డులు ఇచ్చింది .

నేను, ఝాన్సీ, లక్ష్మి రంగమ్మ ఎప్పుడూ కలిసి వుంటాం.  మేము ముగ్గురం మా వూరి నుంచి టిఫిన్ క్యారేజీలు పట్టుకుని పక్క వూళ్లో వున్న స్కూల్ కి వెళ్తాం.

ఉమారాణి కార్డులు ఇచ్చినప్పటి నుంచి మాకు హడావిడి మొదలైంది.

పెళ్లికి ఏం కొనివ్వాలా, మేం ఏం లంగాలు జాకెట్లు వేసుకోవాలా అని ఒకటే కబుర్లు.  సెంటర్ లో వున్న ఒకే ఒక స్టీల్ కొట్టుకు వెళ్లాం.

మేం ముగ్గురం ఒక్కొక్కరు రూపాయి వేసుకోవాలని అనుకున్నాం. తీరా లక్ష్మీ రంగమ్మ దగ్గర అర్ధరూపాయే వుందంది. తన అర్ధరూపాయి కూడా నేనే ఇచ్చాను.

మూడు రూపాయలు పెట్టి వంకీలతో వున్న గంధం గిన్నె కొన్నాం.

పెళ్లి పొద్దున్న ముహూర్తం ఆ రోజు తెల్లారే లేచిపోయాను . మా పెద్దనాయనమ్మ రాజమ్మ జడవేసి రంగురంగు పూలతో దండకట్టి తలలో పెట్టి అందంగా సర్దింది. కోరా రంగు కి పొగాకు రంగు జరీ అంచు లంగా అదే రంగు జాకెట్టు వేసుకుని ముస్తాబయ్యాను.

నాయనమ్మ ముద్దులాడుతూ "మా అమ్మే పెళ్లి కూతుర్లా వుంది" అని మురిసి పోయింది. “ఛీ నేనేం పెళ్లి చేసుకోను” అని సిగ్గుగా అరిచాను.

పెళ్లి మండపం దగ్గరికి మేము చేరేటప్పటికి పెళ్లి కొడుకును కూర్చోబెట్టేశారు. అతను ఇంజినీరంట ఉమారాణీ అతనిలో సగం ఎత్తుంది.

ఉమారాణీ మమ్మల్ని చూసి నవ్వింది కానీ మమ్మల్ని ఎవరూ దగ్గరికి వెళ్లనివ్వలా .

పెళ్లి జరిగింది.

ఇక భోజనాలు ఎప్పుడా అని మేం చూస్తున్నాం

అసలే నాకు బంతిభోజనాలంటే ఇష్టం.

అందరూ ఒక్కొక్కరూ చేతులో బుడ్డి చెంబులు పట్టుకుని కింద పరచిన బంతి చాప మీద వరసగా కూర్చుంటున్నారు.

"అదేంటి ఎవరి నీళ్ల చెంబు వాళ్లు తెచ్చుకుంటున్నారు" అని ఝాన్సీ ని అడిగాను .

"ఈ అగ్రహారంలో అంతే" అంది.

మేం కూడా వెళ్లి కూర్చోబోయాం. అక్కడ కూర్చున్న ఓ ముసలాయన "ఒరేవ్ ! ఈ పిల్లలు మనవాళ్లు కాదనుకుంటా ! అసింటా తీసుకెళ్లి పెట్టండి భోయినం" అని అరిచాడు.

వడ్డిస్తున్న ఇంకో ఆయన “పిల్ల స్నేహితులట పోనీ ఆ వసరాలో పెట్టేద్దాం” అన్నాడు. మమ్మల్ని వసరాలో కూర్చోబెట్టి విస్తరాకులు వేశారు.

నేను వాళ్లు జిలేబీ ఎప్పుడు పెడతారా అని చూస్తున్నా.

ఈలోగా లక్ష్మీరంగమ్మని చూసిన ఎవరో వచ్చి వడ్డించబోతున్న ఆయన చెవిలో ఏదో చెప్పాడు. ఆయన గబాలున వడ్డించడం ఆపేసి "పాపా మీతో పాటు వచ్చిందే ఆ అమ్మాయికి బయట పెట్టి ఆనక మీకు వసారాలో పెడతాం" అన్నాడు .

మళ్లీ ఆయనే .. " లేకపోతే జతగా తినండి మీరు ముగ్గురూ , ఆ బయట కూర్చోండమ్మా" అని ఆకులు దూరంగా వేసి భోజనం పెట్టారు. తినబోతున్న నన్ను చూసి ఝాన్సీ మోచెయ్యితో పొడిచి "ఛ్చి ఛీ పోదాం పద" అంది.

" పెళ్లికి వచ్చి పెళ్లిభోజనం తినప్పోతే ఎట్టా?" అన్నాను. ఏం చెయ్యలేక ఝాన్సీ మాతో పాటే తింది.

లక్ష్మిరంగమ్మ నారాయణ కూతురని తెలుసుకుని కక్కలేక మింగలేక బయట భోజనం పెట్టారు. కానీ నాకు ఉమారాణీ, లక్ష్మీ రంగమ్మ ఇద్దరూ సమానమే. లక్ష్మీరంగమ్మకి జతగా బయటకూర్చుని తిన్నందుకు ఇప్పటికీ నాకు గర్వమే .

(వచ్చేనెల మరో కథ)

Post your comments